కథా నిలయం
శ్రీకాకుళం

# నిశ్శబ్ద తల్పం

బాత్‌రూంలో నీళ్ళచప్పుడికి మెలకువ వచ్చింది మూర్తికి.

ఆశ్చర్యమేసింది. గోడగడియారం కేసి చూశాడు.

కనీ కనిపించకుండా, ఆరున్నరవుతోంది!

అమితాశ్చర్యంగా ఉంది మూర్తికి, తనకన్నా ముందే సుమిత్ర నిద్రలేవడం ఆశ్చర్యంగా ఉంది. పక్క మీంచి లేద్దామనుకున్నాడు. మళ్ళీ వద్దనుకున్నాడు. తీయబోయిన దుప్పటిని ముందులాగే ముసుగెట్టాడు. కానీ కళ్ళని విప్పార్చే ఉంచాడు. తెరిచిన కళ్ళతో సుమిత్రని ముసుగు కప్పిన చీకట్లోనే చూడ్డానికి ప్రయత్నించాడు.

బాత్‌రూం తలుపు తెరుచుకున్న చప్పుడు వినబడింది.



గుండె చప్పుడుని నెమ్మది నెమ్మదిగా ఆపి సుమిత్రని గమనించాడు.

సుమిత్ర నెమ్మదిగా, మరీ నెమ్మదిగా, నింపాదిగా పాటకూడా పాడుతున్నట్టుంది.

నెలరోజులయి చీకటి కప్పిన మూర్తి ప్రపంచంలో వసంతం అప్పుడే మొగ్గతొడిగినట్టుంది.

మూర్తికి ఆనందంగా ఉంది. మనసు తోటలో కోయిలలు కూసినయి.

వెంటనే ముసుగు తీసి లేచి కూచున్నాడు.

గదిలో సుమిత్రలేదు.

వంటగదిలో గిన్నెలు కదిలిన శబ్దం.

రోజూ ఈ పాటికి సుమిత్ర కన్నా ముందే తను నిద్రలేచేవాడు. పాలు పోయించుకునేవాడు. పొయ్యి వెలిగించి పాలు వెచ్చజేసేవాడు. తర్వాత అరగంట మాత్రమే వచ్చే పంపు దగ్గర నీళ్ళు స్టోర్ చేసేవాడు. అప్పుడు— అప్పుడు తాను మొహం కడుక్కునే టయిముకి— సుమిత్ర నిద్రలేచేది. ఆ నిద్రమొహంతోనే మూర్తికి కాఫీ పెట్టి ఇచ్చేది.

కాఫీ అందుకుంటున్నప్పుడు ఆశగా సుమిత్ర మొహం కేసి చూసేవాడు. నిద్రపోతున్నప్పుడు ఏ భావమూ లేక ఎలా ఉండేదో అలాగే నిర్లిప్తంగా, నిరాసక్తంగా ఉండేది. కాఫీ అందుకుని కాస్సేపు పేపరు చదివాక స్నానం చేసేవాడు. ఈ లోపున వంట అన్నమూ, ఒక కూరో, ఒక చారో చేసేది - సుమిత్ర ఏ ఒక్కటీ ఉడికీ, ఉడక్క ఉండేది. మూర్తికి మొదట్లో సహించేది కాదు. కానీ ఈ నెల్రోజులుగా అలవాటయిన కారణంగా ఇప్పుడు బాధగా ఉండటంలేదు.

నెలరోజుల క్రితం సుమిత్రని కొత్తగా కాపురానికి హైదరాబాదు తీసుకొచ్చాడు.

మొదటి రోజు రాత్రి సుమిత్రని దగ్గరకి తీసుకుంటున్నప్పుడు

''వద్దండీ— నన్ను దగ్గరికి తీసుకోవద్దు నాకు మీరంటే ఇష్టంలేదు! మన పెళ్ళికి ముందే నేను వెంకట్రావుని, నేను చదువుకుంటున్న

ప్పట్నుంచీ ప్రేమించాను. అతను నాకిష్టం. కానీ అతనికి పోయినేడే పెళ్ళయిపోయింది. నన్నే పెళ్ళాడ్దామనుకున్నాడు కానెందుకో నన్ను చేసుకోలేదు. కారణాలు నాకు చెప్పలేదుకానీ ఏవో తప్పని పరిస్థితులు! నేనర్థం చేసుకోగలను. తలిదండ్రుల్ని బాధ పెట్టలేక నేనూ తలదించుకుని మీతో పెళ్ళికొప్పుకున్నాను. అంతే నిజానికి నేను వెంకట్రావుని ఇంకా మరిచిపోలేకపోతున్నాను. అందుకే నేను మీ దగ్గరకి రాలేను— క్షమించండి. నన్ను మీరు పెళ్ళాడినందుకు నేను మీకు తోడుగా ఉండగలను కానీ— భార్యగా ఉండలేదు— ఈ ఒక్క విషయంలో నన్నెప్పుడూ ఇబ్బంది పెట్టకండి ప్లీజ్'' అంది సుమిత్ర.

సుమిత్ర అలా నిర్భీతిగా, నిశ్చయంగా మొదటి రాత్రే తన గురించి చెప్పేసుకున్నాక మూర్తికి నోటమాటరాలేదు. చాలాసేపు స్తబ్దుగా ఉండిపోయాడు ఆ రాత్రి ఆగిపోయింది.

మూర్తి సంసార జీవితం అలా ఆగిపోయింది.

ఇప్పటికీ ఈ నెల రోజులుగా కూడా ఏ మాత్రం కదలకుండా పోయింది.

అందుకే ఇవాళ ఆశ్చర్యంగా ఉంది మూర్తికి.

నెలరోజులుగా కదలకుండా ఉండిపోయిన బొమ్మకి ప్రాణం వొచ్చినట్టుగా ఉంది.

సుమిత్ర ఇవాళ తనకన్నా ముందే నిద్రలేచింది. స్నానం చేసింది. వంట చేసింది. ఇల్లు సర్దింది. కర్టెన్లు మార్చింది. ఇన్ని పనులు చేస్తూ మధ్య మధ్యలో తనని గమనిస్తోంది.

మూర్తికి అద్భుతంగా ఉంది.

కాలిపోయిందనుకున్న వసంతం చిగురు తొడిగినట్లుంది. మనసు ప్రవాహం ఉరుకలెత్తింది.

ఆఫీసుకు బయల్దేరుతుంటే సుమిత్ర దగ్గరికి వచ్చి ''ఇవాళ ఆఫీసుకి మానేయకూడదూ'' అంది.

''ఇవాళ ఆఫీసులో ఇన్స్పెక్షనుంది. మానేయలేను— కానీ రోజుకన్నా తొందరగా వచ్చేస్తాను. సరేనా?'' అన్నాడు మూర్తి.

వసంతంలో విరిసిన మొదటి పువ్వు ఆహ్వానిస్తున్నా కళ్ళు మూసుకున్నట్టుగా ఉంది మూర్తికి.

—''అది కాదు మీరు లేకుండా బావుండదు! వెంకట్రావుని భోజనానికి పిలిచాను— నిన్న మార్కెట్లో కనిపించాడు. భోజనానికి పిలిచాను. అతను వచ్చినప్పుడు మీరు లేకుండా ఉంటే బావుండదు. అందుకనీ... మీరు మధ్యాహ్నం సెలవు పెడితే బావుంటుంది. అతను ఒంటిగంటకు వస్తాడు'' అంది సుమిత్ర.

హఠాత్తుగా అదే స్థితి!

నెల్లాళ్ళక్రితం తమిద్దరి మధ్యా తలెత్తిన స్థితి!

చేతులు కలిపి నుంచున్నా ఇద్దరి మధ్యా అగాధం!

ఇవ్వాల్టికీ అదే అగాధం!

మూర్తి కుంగిపోయాడు.

నెలరోజులుగా ఒకే ఇంట్లో ఒంటరిగా ఉంటూ కూడా సంసారాన్ని నటిస్తున్నాడు. ఇప్పుడు మూడో మనిషి ముందు నటించాలి!

మూర్తి నెమ్మదిగా నవ్వి ''సరే— వస్తాను. ఒంటిగంటకల్లా ఎలాగోలా వచ్చేస్తాను'' అంటూ తలుపులు దగ్గరికి వేసి వెళ్ళిపోయాడు. క్షణంసేపు ఉండి తర్వాత సుమిత్ర 'థాంక్స్!' అంది.

* * *

## —చంద్ర

సరిగ్గా గోడగడియారం ఒంటి గంట కొడుతుండగా చప్పుడయితే తలుపు తీసింది సుమిత్ర ఎదురుగా మూర్తి!

మూర్తి మొహం చాలా దూరం నడిచి వచ్చినట్టుగా ఉంది. అలసటగా ఉంది. చెమటలు కారుతున్నాయి.

చెప్పిన టైమ్‌కి ప్రత్యక్షమయిన మూర్తిని చూసి మొదటిసారిగా సుమిత్రకి ఆనందం కలిగింది.

''థాంక్సండీ!'' అంది.

''ఎందుకూ— వస్తానని చెప్పానుగదా!'' అన్నాడు మూర్తి.

సుమిత్రకి జవాబేమీ తట్టలేదు.

''అలసటగా కుర్చీలో కూచుని తలవెనక్కి జార్చాడు మూర్తి. సుమిత్ర దగ్గరగా వచ్చి ''మొహం కడుక్కోండి, అతను వచ్చేటయిమయింది.'' అంది.

మూర్తి దిగ్గున లేచి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

మొహం కడుక్కున్నాడు. టవల్‌తో మొహాన్ని అద్దుకున్నాడు. వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. అప్పుడు గమనించాడు.

ఇల్లు—

తన ఇల్లు ఇంటీరియల్ డెకొరేట్ ఎవరో పొందిగ్గా అలంకరించినట్టుగా ఉంది. ఇల్లులా లేదిప్పుడది! అద్భుతమైన సినిమా సెట్‌లా ఉంది.

డైనింగ్ టేబిల్ మీదనుంచి వంటకాలు తమ సువాసనలతో కడుపునింపుతున్నాయి.

తనకి ఈ నెల్లాళ్ళుగా తెలిసిన సుమిత్ర ఇవ్వాళ మరో సుమిత్ర!

సుమిత్రని పెళ్ళాడి చాలా పోగొట్టుకున్నట్టు మొదటిసారిగా తెలిసింది మూర్తికి.

మొదట్లో 'వయసు వల్ల, మోహం వల్ల కలల్లో ఉంటోందీ— రోజులు గడిచాక తోడుగా బతకటంవల్ల ఎప్పటికయినా తప్పు తెలుసుకుంటుంది' అనుకున్నాడు.

ఇంకిప్పుడు ఆ ఆశకూడాలేదు!

మూర్తికి తను ఓడిపోయినట్టుగా అనిపించింది.

కుర్చీలో అలాగే వాలిపోయి కళ్ళు మూసుకున్నాడు.

* * *

''ఇప్పుడు టైయిమెంతయ్యిందో తెలుసా? రెండుముప్పావు! నువ్వు వస్తానన్నది ఒంటిగంటకు. ఆయన్ని ఆఫీసు మానేసి రమ్మంటే సరిగ్గా ఒంటి గంటకొచ్చారు. నిన్ను ప్రేమించాను— పెళ్ళి చేసుకుందామనుకున్నాను— కానీ నువ్వు ఇంకొకర్ని పెళ్ళాడావు. ఎందుకూ అని ఎప్పుడూ నిన్ను నిలదీసి అడగలేదు— సంతోషంగానే నీ ఎడబాటుని స్వీకరించాను.

''నీ మీద ప్రేమని చంపుకోలేక ఇక్కడికి నా ఇంటికి భోజనానికి పిలిచాను. నీ కోసం ఆయన్ని ఎంత చిత్రవధకి గురి చేశానో, గురి చేస్తున్నానో ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

''ఈ గంటన్నర సేపు రాని నీ గురించి ఎంత ఆదుర్దా పడ్డానో, ఆరాట పడ్డానో నాకు తెలుసు.

''ఇప్పుడే అర్థమవుతోంది— ఆయన నెల రోజులుగా నాకోసం ఎంతగా ఎదురు చూస్తున్నారో అర్థమవుతోంది. వెళ్ళు— దయచేసి ఇంకెప్పుడూ ఇక్కడికి రాకు. ఈ సుమిత్ర నిన్ను ఇప్పుడు ప్రేమించడంలేదు. వెళ్ళు'' అంటూ అరిచింది సుమిత్ర.

మూర్తి చటుక్కున కళ్ళు తెరిచాడు. గుమ్మంలో వెంకట్రావు మొహం దించుకుని వెనక్కి తిరిగాడు.

సుమిత్ర ధడాలున తలుపులు మూసింది.

మూర్తి కంగారుగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

సుమిత్ర వెనక్కి తిరిగి తలుపునానుకుని ఏడుస్తోంది.

*